నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 15 నవంబర్ 2024 | VIKARABAD



పరిగి సబ్‌జైలులో రైతులను కలిసి పరామర్శించిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్, హరిప్రియనాయక్

సర్వే తెచ్చిన తంటా..!

సిటీబ్యూరో, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : మూలిగే నక్కపై తాటి పండు పడిందన్న చందంగా 'సర్వే' జీహెచ్ఎంసీకి సరికొత్త తంటాను తెచ్చిపెట్టింది.సంస్థకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్ను వసూళ్లపై ఈ సర్వే ప్రభావం తీవ్రంగా పడుతున్నది. ప్రభుత్వం గడిచిన ఆరు రోజులుగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లు దాదాపు 19వేల మంది పాల్గొంటుండగా.. ఈ నెల 30వ తేదీ వరకు ఈ సర్వేలోనే వీరంతా కొనసాగుతారు. వీరికి సర్వే బాధ్యతలు రావడంతో ఆస్తి పన్ను వసూళ్లలో వేగం మందగించింది. గడిచిన 14 రోజుల్లో ఆస్తిపన్ను రూపంలో దాదాపు రూ. 10 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఈ సమయానికి రూ. 30 కోట్ల మేర ఆదాయం రావాల్సి ఉన్నది. కానీ సర్వే కారణంగా వసూళ్లపై అధికారులు ఏం చేయలేని పరిస్థితి. వాస్తవంగా గత నెలలో రూ.56 కోట్లు మాత్రమే వసూలు కాగా, ఉద్యోగుల జీతాల చెల్లింపులపై కాస్త ప్రభావం చూపింది. ఈ నెలలో మాత్రం ఆస్తి పన్ను వసూళ్లు అసలే లేకపోవడంతో ఉద్యోగుల జీతాలు ఎప్పుడు చెల్లిస్తారో అన్న చర్చ జరుగుతున్నది.

ప్రాణాలైనా ఇస్తాం..

భూములిచ్చే ప్రసక్తే లేదు

- తెగేసి చెబుతున్న ఫార్మా విలేజ్ భూ బాధిత రైతులు
- తాతల కాలం నుంచి ఈ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నాం
- పచ్చని పొలాలను తీసుకుంటే మేము ఎలా బతకాలి
- ఫార్మా విలేజ్ ఏర్పాటుపై ప్రభుత్వం పునరాలోచించాలి: రైతులు



తమ గ్రామాల్లో కాలుష్య కారక కంపెనీలు వద్దంటూ రిలే దీక్షలు చేపట్టిన ఫార్మావిలేజ్ భూ బాధిత రైతులు (ఫైల్)

వికారాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : ఫార్మా విలేజ్ భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు లగచర్ల వెళ్లిన అధికారులకు రైతులు ఎదురు తిరిగిన ఘటన అనంతరం పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తున్నా తాము మాత్రం భూములిచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. మేం ఓటేసి గెలిపిస్తే సీఎం అయిన రేవంత్ రెడ్డి వచ్చి మమ్మల్ని చంపేసినా భూములివ్వబోమని రైతులు ఖరాఖండిగా చెబుతున్నారు. లగచర్ల ఘటన అనంతరం దాడి చేసిన వారి కోసం అర్ధరాత్రి సమయంలో గాలింపు చేపట్టిన పోలీసులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. కరెంట్ సరఫరా నిలిపివేసి, ఇంటర్నెట్ సేవలను బంద్ చేసి ఇల్లిల్లూ జల్లెడపట్టారు. చిన్నారులు, మహిళలు అని చూడకుండా అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత ఇండ్లలోకి వెళ్లిన పోలీసులు ఎవరూ లేరని మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా దౌర్జన్యంగా వ్యవహరించారు. అధికారులకు ఎదురుతిరిగిన ఘటనలో పాల్గొన్న రైతులు గ్రామంలో లేకపోయినా ఇండ్లలో సోదాలు చేసిన పోలీసులు మహిళలు, చిన్నారుల పట్ల దురుసుగా ప్రవర్తించడంపై రైతు కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తాతల కాలం నుంచి భూములపై ఆధారపడి జీవిస్తున్నామని.. ఇప్పుడు కంపెనీల కోసం భూములిచ్చి తాము ఎలా బతకాలని రైతులు నిలదీస్తున్నారు. ఫార్మా విలేజ్‌కు భూములిచ్చే ప్రసక్తే లేదని, మమ్మల్ని చంపి భూములను తీసుకోండని తెగేసి చెబుతున్నారు. తమ భూములను లాక్కుంటే ఎంతకైనా తెగిస్తామని స్పష్టం చేస్తున్నారు. రైతుల మనోవ్యథను గుర్తించి పునరాలోచించాలని, ఇంకా పోలీసులతో భయపెట్టాలని చూడొద్దని రైతులు తాము ఓటేసి గెలిపించుకున్న సీఎంను డిమాండ్ చేస్తున్నారు.

నోటికాడి కూడు లాక్కోవద్దు..

పుట్టినప్పటి నుంచి ఈ భూమిని నమ్ముకునే బతుకుతున్నా. చదువు లేదు, ఉద్యోగం చేయలేను. గిప్పుడు ఈ ఫార్మా కంపెనీలతో మా భూములు పోతాయని అంటుండ్రు. అవే పోతే మా బతుకులు ఎట్టా.. ఏం చేసుకొని బతకాలి. ఎక్కడ పోయి బతకాలి. అందుకే భూములివ్వం. మాలాంటి చిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి.. రోడ్డున పడేస్తే.. ఎట్లా..? మా పొలాలు మాకు కావాలి.. నోటికాడి కూడు లాక్కోవద్దు. - హర్యానాయక్, గలచెర్ల, దుద్యాల మండలం

పది నెలలుగా నిరసన తెలుపుతూనే ఉన్నాం

హకీం పేట, పోలేపల్లి, లగచర్లతోపాటు తండాల రైతులందరం కలిసి తమ బతుకులు ఆగమవుతాయని గత పది నెలలుగా అన్ని పనులు వదులుకొని ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూనే ఉన్నాం. తాతల కాలం నుంచి ఈ భూములే మమ్మల్ని బతికిస్తున్నాయి. ఈ భూములను సర్కారు తీసుకుంటే మా బతుకులు ఆగమవుతాయి. వలస వెళ్లాల్సిన దుస్థితి వస్తుందని ప్రభుత్వానికి మరోసారి స్పష్టం చేస్తున్నాం. మరోవైపు లగచర్ల ఘటన అనంతరం ఫార్మా విలేజ్ ఏర్పాటుపై ప్రభుత్వం వెనుకడుగు వేస్తుందని భూములు కోల్పోతున్న గ్రామాలు, తండాల రైతులు భావించినా.. ప్రభుత్వం మాత్రం ఫార్మా విలేజ్ ఏర్పాటు దిశగా ముందుకే వెళ్తున్నది. సీఎం సోదరుడు లగచర్లతో పాటు మిగతా గ్రామాల్లో పర్యటించి ఫార్మా కంపెనీల కోసం భూములివ్వాల్సిందేనని చెబుతుండడంపై ఆయా గ్రామాల రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర సర్కారుపై మండిపడుతున్నారు.

బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారం

లగచర్ల ఘటన అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితారెడ్డితో పాటు బీఆర్ఎస్ నేతలంతా తప్పుపడుతున్నారు. లగచర్ల ఘటనలో అధికారులకు వ్యతిరేకంగా రైతులు తిరగబడిన విషయంలో కేవలం బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారిని మాత్రమే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి.. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పోలీసులను ముందుపెట్టి బీఆర్ఎస్ నేతలను ఇరికించే కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. పోలీసులు సరైన విచారణ చేయకుండానే ప్రభుత్వ పెద్దలు టార్గెట్ చేసుకొని చెబుతున్న ప్రకారం కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు.

రైతులూ భయపడొద్దు..

- మీ పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుంది
- అరెస్టు అయిన వారందరూ తమ కుటుంబసభ్యులే
- మమ్మల్ని జైల్లో పెట్టి రైతులను వదిలిపెట్టాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- లగచర్ల ఘటనలో అరెస్టై పరిగి సబ్‌జైలులో ఉన్న రైతులను కలిసి పరామర్శించిన ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి, హరిప్రియానాయక్

పరిగి, నవంబర్ 14 : రైతులూ భయపడొద్దని.. మీ పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అభయమిచ్చారు. రైతుల కుటుంబాలకు భరోసా కల్పించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మమ్మల్ని ఇక్కడికి పంపించారని, అరెస్టైన వారందరూ తమ కుటుంబసభ్యులుగానే భావిస్తున్నామన్నారు. లగచర్ల ఘటనలో అరెస్టై పరిగి సబ్‌జైలులో ఉన్న రైతులను ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి, హరిప్రియానాయక్‌లతో కలిసి ఆమె పరామర్శించారు. అనంతరం సబితారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దాడి జరగలేదని కలెక్టర్ అంటుండగా.. దాడి జరిగిందని పోలీస్‌శాఖ అంటున్నదని.. దీనిలో ఎవరి మాట నమ్మాలని ప్రశ్నించారు. ఈ ఘటన పోలీస్ శాఖ వైఫల్యమని, ఆ శాఖను చూస్తున్న సీఎం రేవంత్ ఫెయిల్యూర్ అని మండిపడ్డారు. వారి వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు బీఆర్ఎస్‌పై నెపం నెడుతున్నారని ఆరోపించారు. ఒక ప్రజా నాయకుడిగా 15 పర్యాయాలు కాదు 30 పర్యాయాలు మాట్లాడతారని, జనాలకు ఇబ్బంది ఉన్నప్పుడు మా కార్యకర్తలు వందసార్లు ఫోన్ చేస్తారని, మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం తామంతా జైలుకెళ్లేందుకు సిద్ధమని.. మమ్మల్ని జైల్లో పెట్టి రైతులను వదిలిపెట్టాలని సబితారెడ్డి డిమాండ్ చేశారు. జైలులో ఉన్న రైతులు, బయట ఉన్న వారి కుటుంబసభ్యుల ఆవేదన చూస్తుంటే బాధ కలుగుతున్నదని, కన్నీళ్లు వస్తున్నాయన్నారు. లగచర్లలో జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో ఇటు రైతులు, అటు అధికారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆ ఘటనలో పాల్గొనని వారిని కూడా పోలీసులు అరెస్టు చేశారని, గ్రామ కార్యదర్శి పక్క గ్రామంలో సర్వే చేస్తుంటే అతడిపైనా కేసు నమోదు చేశారని మండిపడ్డారు. ఈ కేసులో 55 మందిని తీసుకొచ్చి 21 మందిని పంపించామని పోలీసు అధికారి చెప్పారని, కాంగ్రెస్ పార్టీ నాయకులను పక్కన పెట్టి బీఆర్ఎస్‌కు సంబంధించిన వారినే అరెస్టు చేశారన్నారు. ఠాణాలో రైతులను తీవ్రంగా హింసించారన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాల్సి ఉండగా కేవలం బీఆర్ఎస్‌పైనే నెపం నెట్టడం రేవంత్‌రెడ్డి ఆడుతున్న నాటకమని పేర్కొన్నారు.

ఈ డైవర్షన్ రాజకీయంలో రైతులు బలిపశువులు అయ్యారన్నారు. ఈ కేసులో అకారణంగా మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని అరెస్టు చేశారని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఈ కేసులో ఇరికించాలని యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల కేటీఆర్ బావమరిది ఇంట్లో దావత్ అయితే ఆ కేసు, కార్ రేసింగ్ కేసుల్లోనూ మాజీ మంత్రిని ఇరికించాలని శతవిధాలా యత్నిస్తున్నారని ఆరోపించారు. మీరు ఎంతమందిని జైలుకు పంపించినా.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా బీఆర్ఎస్ పార్టీ ప్రజల గొంతుకై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ పేరును చెరిపేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఫార్మాసిటీని రద్దు చేస్తామని ఒక మాట, ఉంటుందని మరోమాట చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కొడంగల్ ప్రజలు ఓటేస్తేనే ఎమ్మెల్యేగా గెలిచి.. సీఎం అయిన రేవంత్‌రెడ్డి.. తన సెగ్మెంట్‌లో ఇంత పెద్ద ఇష్యూ అవుతుంటే ఎందుకు ఒక్క మాటా మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఆయనకు ఓటేసిన రైతులను జైలుకు పంపించారని తీవ్రంగా దుయ్యబట్టారు.

సబ్‌జైలులో ఉన్న రైతులను పరామర్శించిన అనంతరం వారి కుటుంబసభ్యులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడారు. తాము భూములను ఇవ్వబోమని గిరిజన యువతి పేర్కొన్నది. దాడి ఘటనలో లేకున్నా అన్యాయంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. మీరందరూ మా కుటుంబసభ్యులేనని కేసీఆర్, కేటీఆర్ చెప్పారని, రైతులందరికీ పార్టీ బెయిల్ వచ్చేలా చర్యలు తీసుకుంటుందన్నారు. కడా అధికారిని కాపాడి, తాగేందుకు నీరు ఇచ్చిన వారిపైనా కేసు పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల శ్యాంసుందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వికారాబాద్ బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, కమాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాములు, సంతోష్, పాండు, శేఖర్‌రెడ్డి, చేవెళ్ల నాయకుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి.. ఫెయిల్యూర్ సీఎం..

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా విఫలమయ్యారు. కలెక్టర్‌పై దాడి జరిగిందంటే నిఘా విభాగం ఏమి చేస్తున్నట్లు. తాను సురేశ్‌తో మాట్లాడినట్లు ఆధారాలు చూపిస్తే.. రైతుల కోసం జైలుకెళ్లేందుకూ సిద్ధమే. తాటాకు చప్పుళ్లకు భయపడా. కలెక్టర్ అసలు దాడే జరగలేదని చెబితే.. పోలీసులు దాడి జరిగిందని ఎందుకు అరెస్టు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ కుట్ర చేసిందని అంటున్నారు.. లగచర్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ మెజారిటీ వచ్చింది.. అలాంటప్పుడు బీఆర్ఎస్ వారు చెబితే అక్కడి కాంగ్రెస్ నాయకులు వింటారా..?

-డాక్టర్ మెతుకు ఆనంద్,
బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే

బలవంతంగా భూములు తీసుకోవద్దు

రైతులు ఫార్మా కంపెనీల ఏర్పాటుకు భూములు ఇవ్వబోమని చెప్పినా వినకుండా బలవంతంగా తీసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. లగచర్లలో కాంగ్రెస్ కార్యకర్తలే దాడి చేయగా..55 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆ పార్టీ నాయకులను వదిలిపెట్టారు. -కోవా లక్ష్మి, ఎమ్మెల్యే

కేసీఆర్ హయాంలో ఒక్క రైతుకూ ఇబ్బంది కలుగలేదు

రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలోనే రైతుల పరిస్థితి ఇలా ఉందంటే..రాష్ట్రంలోని ప్రజలు, రైతులు ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. గతంలో పెద్ద ప్రాజెక్టులు కట్టినప్పుడు ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది కలగకుండా మాజీ సీఎం కేసీఆర్ చర్యలు తీసుకున్నారు.

-హరిప్రియానాయక్, మాజీ ఎమ్మెల్యే

పథకాల అందజేతలో జాప్యం తగదు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

రంగారెడ్డి, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): షెడ్యూల్డ్ కులా లవారికి సంక్షేమ పథకాలు అందించడంలో జాప్యం చేయొద్దని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. గురువారం రంగారెడ్డి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌లతో కలిసి షెడ్యూల్డ్ కులాలకు వివిధ పథకాల అమలుతీరుపై ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పులు ఏ మేరకు అందుతున్నాయి, ఎస్సీ జూనియర్ అడ్వకేట్లకు ప్రోత్సాహకాలు ఎలా అందుతున్నాయో తెలపాలని అధికారులను రాంచందర్ ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ఎస్సీ కాలనీల్లో రోడ్ల నిర్మాణాలకు ఎంజీఎన్ఆర్ స్కీం ద్వారా ఎన్ని నిధులు విడుదలయ్యాయి, ఆయా నిధుల ద్వారా ఎన్ని కాలనీల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న, మధ్యతరగతి పరిశ్రమల్లో ఎస్సీ కులాలవారికి సబ్సిడీ యూనిట్ల వివరాలను తెలుపాలని, అందుకు సంబంధించిన నివేదికను అందజేయాలని పరిశ్రమల శాఖ అధికారిని ఆదేశించారు. ఎస్సీ కులాలకిచ్చిన భూముల పరిరక్షణలో రెవెన్యూ శాఖ దృష్టి సారించాలని, ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు, వారిపై ఎవరైనా కేసులు నమోదు చేస్తే తగు చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ఆయా శాఖలు సకాలంలో ఖర్చు చేసి షెడ్యూల్డ్ కులాలవారి సంక్షేమానికి అన్ని శాఖలు కృషి చేయాలన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి అన్ని విధాలా తోడ్పాటును అందిస్తామని, ఎక్కడా ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు చేపడుతామని తెలిపారు. అంతకుముందు రాంచందర్ కలెక్టరేట్ ఆవరణలో మొక్క నాటారు. సమావేశంలో జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీత, డీసీపీ పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్

క్షణాల్లో ఆహార నాణ్యత నిర్ధారణ

సిటీబ్యూరో, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : రోడ్డుపక్కన మిర్చీ బండి.. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్.. ఫైవ్ స్టార్ హోటల్.. స్థాయి ఏదైనా వాటిలో లభించే ఆహార పదార్థాల్లో ఏదో ఒక రూపంలో కల్తీ జరుగుతున్నదని ఆహార పరిరక్షణ సంస్థ నిర్వహిస్తున్న తనిఖీల్లో వెల్లడవుతున్నది. టీ పొడి, పాలు, పండ్లు, పప్పులు, సాస్‌లు, చక్కెరతో చేసే మిఠాయిలు, నూనె, కారం పొడి, బేకరీ ఉత్పత్తులు, నిల్వ తీపి పదార్థాలు, హోటళ్లలో తయారు చేసిన ఆహారాల వరకు అన్నింటిలోనూ నాణ్యతా ప్రమాణాలు లోపించాయని తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి. కొరవడిన ప్రమాణాలు సగటు మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆహార నాణ్యత విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఆహార నాణ్యత విషయంలో అనుమానం ఉంటే అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించి..నిర్ధారించనున్నారు. రోజూ వాడే ఆహార పదార్థాల్లో కల్తీ జరుగకుండా నిరంతర పర్యవేక్షణ చేసేందుకు ఫుడ్ సెక్యూరిటీ స్టాండెడ్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' మొబైల్ వ్యాన్‌ను గత ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ వ్యాన్‌తో సత్ఫలితాలు వస్తుండటంతో జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో జోన్‌కు ఒకటి చొప్పున 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' మొబైల్ వ్యాన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. త్వరలోనే జోన్‌కు ఒకటి చొప్పున ఈ వ్యాన్‌లను అందుబాటులోకి తెస్తామని అధికారులు తెలిపారు. ఈ వాహనాలతో అక్కడికక్కడే నాణ్యతను నిర్ధారించనున్నారు. హానికరం, నకిలీ(మిస్ బ్రాండెడ్), నాసిరకం ఇలా మూడు రకాల ప్రమాణాలపై పరీక్షలు జరుపుతారు. ఆహార నాణ్యతా ప్రమాణాల విషయంలో అనుమానాలుంటే జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ నంబర్ 040-2111 1111లో సంప్రదించాలని అధికారులు కోరారు.

విద్యార్థుల స్కాలర్‌షిప్ బిల్లులు చెల్లించరా?

బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

ఎల్బీనగర్, నవంబర్ 14: కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయల బిల్లులు చెల్లిస్తున్నారు... మరి విద్యార్థుల స్కాలర్‌షిప్ బిల్లులు చెల్లించరా? అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్పులు చెల్లించాలని రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లాపల్లి అంజి ఆధ్వర్యంలో కొత్తపేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగు నెలలుగా విద్యార్థులు రోడ్ల మీదకు వచ్చి ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆర్థిక శాఖ మంత్రికి కాంట్రాక్టర్లు అంటే చాలా ప్రేమ ఉందని, విద్యార్థులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి తన వైఖరి మార్చుకోకపోతే తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు రూ.4 వేల కోట్లను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపల్లి అంజి, వర్కింగ్ ప్రెసిడెంట్ సతీశ్, నాయకులు రాజేందర్, అనంతయ్య, రామకృష్ణ, రమాదేవ్, నీలవెంకటేశ్, మహేశ్, బలరాం, రవి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నాడు అడ్డుకున్నారు.. నేడు కావాలంటున్నారు..

ఫార్మాసిటీపై కాంగ్రెస్ పార్టీది రెండు నాల్కల ధోరణి

- అధికారంలోకి రాగానే సేకరించిన భూములను రైతులకు తిరిగిస్తామన్న హస్తం నాయకులు
- నేడు మొహం చాటేశారు..

ఫార్మాసిటీ ఏర్పాటుపై కాంగ్రెస్ పార్టీ రెండు నాల్కల ధోరణిని అనుసరిస్తున్నది. గత కేసీఆర్ హయాంలో జిల్లాలోని యాచారం, ముచ్చర్ల ప్రాంతాల్లో భూసేకరణను అడ్డుకుని రాజకీయ లబ్ధి పొందిన ఆ పార్టీ.. వికారాబాద్ జిల్లాలో అన్నదాతలు మా ప్రాంతంలో ఫార్మా విలేజ్ వద్దే.. వద్దు అంటూ నిరసనలు వ్యక్తం చేస్తున్నా భూసేకరణకు చర్యలు చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు అసెంబ్లీ ఎన్నికల ముందు.. తాము అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తామని.. రైతుల నుంచి తీసుకున్న భూములను తిరిగి వారికే ఇస్తామని ప్రజలు, అన్నదాతలను రెచ్చగొట్టారు. పవర్‌లోకి రాగానే ఆ మాటను మరిచిపోయారు. రైతులు అడిగితే వారు తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో తమ ప్రాంతాల్లో ఫార్మాసిటీ ఉంటుందా..? ఉండదా..? అనే విషయంపై సర్కారు స్పష్టమైన వైఖరి ప్రకటించకపోవటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను ఒప్పించి.. కందుకూరు, యాచారం మండలంలో 13,500 ఎకరాల భూములను సేకరించింది.

-రంగారెడ్డి, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ)



ఫార్మాసిటీ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం

జిల్లాలోని యాచారం మండలంలో అత్యధికంగా సుమారు 10,000 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించాల్సి ఉండగా కేసీఆర్ ప్రభుత్వం 7,640 ఎకరాలను సేకరించింది. 2,211 ఎకరాలు కోర్టు వివాదంలో ఉండగా ఆ భూములకు కూడా అవార్డు పాస్ చేసి పరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేసింది. అలాగే, కందుకూరు, కడ్తాల్ మండలాల్లో మరో 10,000 ఎకరాలు సేకరించాల్సి ఉండగా ...కడ్తాల్ మినహా కందుకూరు మండలంలో అక్కడి రైతులను ఒప్పించి భూములు ప్రభుత్వం సేకరించింది. ఈ భూములోనే నేడు ఫ్యూచర్‌సిటీ ఏర్పాటుకు సర్కారు ఏర్పాట్లు చేస్తున్నది.

కొత్త కంపెనీలతో ఒప్పందాలు

జిల్లాలో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం సేకరించిన భూముల్లో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం చేసుకుంటున్నది. అరబిందో, రెడ్డీస్ ల్యాబ్స్ తదితర దిగ్గజ కంపెనీలతో రేవంత్ సర్కార్ ఒప్పందం కుదుర్చుకున్నది. గతంలో ఫార్మాసిటీ వద్దన్న కాంగ్రెస్ నాయకులు.. ఫార్మా కంపెనీలతో ఒప్పందం చేసుకోవడంపై రైతు సంఘాల నాయకులు భగ్గుమంటున్నారు. ఒక్కో కంపెనీకి 50 ఎకరాల చొప్పున పరిశ్రమల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించ నున్నట్లు సమాచారం.

ఫార్మాసిటీపై స్పష్టత ఇవ్వాలి

ముచ్చర్లలో ఫార్మాసిటీ ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ పార్టీ తమ వైఖరిని స్పష్టం చేయాలి. ఫార్మాసిటీని రద్దు చేస్తామని చెప్పిన ఆ పార్టీ నాయకులు మరోవైపు ఫార్మా కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవడంతో ఈ ప్రాంత ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఇంతకు ముచ్చర్లలో ఫార్మాసిటీ ఉంటుందా..? ఉండదా..? చెప్పాలి. నాడు ఫార్మాసిటీని వ్యతిరేకించి.. నేడు వికారాబాద్ జిల్లాలో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు భూములను సేకరించడం విస్మయానికి గురి చేస్తున్నది. -మక్కపల్లి స్వరూప, మేడిపల్లి

రైతులకు భూములు తిరిగి ఇవ్వాలి

గత ప్రభుత్వం సేకరించిన భూముల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్నారా..? లేదా..? అనే విషయంపై సర్కారు స్పష్టతనివ్వాలి. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు రైతుల భూములను వారికి తిరిగి ఇవ్వాలి. కానీ, రేవంత్‌రెడ్డి సర్కారు భూముల విషయంలో ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఒకసారి ఫార్మాసిటీ ఉంటుందని.. మరోసారి ఉండదు అని ప్రజలు, రైతులను అయోమయానికి గురిచేస్తున్నది.

-బాలకృష్ణగౌడ్, మీర్‌ఖాన్‌పేట